## వేదుల చిన్న వేంకట చయనులు - నవ్య వీక్లీ కథల పోటీలో


# తృతీయ బహుమతి రూ. 5,000 పొందిన కథ

రాబోయే వానరాక మోసుకొచ్చే వార్తావహునిలా చల్లటి గాలి రివ్వున వీచి, విభావరి చెంపలను స్పృశించింది.

ఆ చల్లనిగాలి, ఆ వెంటే భోరుమంటూ మొదలైన వర్షం, విభావరి మనసును ఉత్తేజితం చేశాయి.

ఉద్వేగ భరితమైన హృదయంతో వర్షంలోకి చూస్తుండిపోయిందామె.

''సృష్టిలో అన్నిటికన్నా అందమైనది వర్షమే'' అనిపిస్తుంది విభావరికి. వానలో తడవడం ఆమెకిష్టమైన పనుల్లో ఒకటి. జీవితంలో ఇంతవరకూ విభావరి గొడుగనే వస్తువును ఎన్నడూ వాడలేదు.



# గొడుగు

ఎ. పుష్పాంజలి

వర్షానికి నేలమీద రేగే దుమ్ము లాగానే మనసులో జ్ఞాపకాల మేఘాలూ ముసురుకొంటాయి. బాల్యం నాటి అనుభూతులూ, యవ్వనంలో సంఘటిల్లిన మధుర జ్ఞాపకాలూ మనసును ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. వాటితోబాటూ జీవిత పయనంలో మూటలు కట్టిన బరువులూ, బాధలు గుండెను పిండుతాయి. అందుకే వర్షం గతాన్ని తెచ్చి మనముందు కుమ్మరించే జ్ఞాపకాల దొంతరలా అనిపిస్తుందామెకు.

నిట్టూర్చింది విభావరి.

'జీవితం ముందు ముందుకు సాగే కొలదీ మనిషి మరింత బరువు నెత్తికెత్తుకుంటాడు' అనుకుంది.

ఆమె ఆలోచనల్ని భంగం చేస్తూ ఫోను మోగింది. ఆత్రంగా ఫోనెత్తుకుంది. సాయంత్రమైతే ఆమె ఆత్రంగా ఎదురుచూసే ఫోన్ కాలది.

''విభావరిగారూ! ఏం చేస్తున్నారు?'' అన్న సహదేవ్ పలకరింపుతో మొదలైన సంభాషణ, సన్న సన్నకాలువలు కలిసి ఉధృత ప్రవాహంగా మారినట్టు ఆమెను భావలహరిలో ముంచెత్తాయి.

అలా తనకోసం తను ఓ పది నిముషాలు జీవించాక కింద నుంచి అత్తగారి పిలుపు.

''అమ్మాయ్ విభా! ఇలా కిందికి రామ్మా. ఈ దశమ, ఏకాదశ అధ్యాయాలు బొత్తిగా బోధపడడం లేదు''.

ఫోనుపెట్టేసి కిందికి దిగక తప్పలేదు విభావరికి. ఈ గీతా కాలక్షేపం కేవలం తనకోసమే! తను కాలేజీ నుంచి కాస్త ఆలస్యంగా వచ్చినా, ఎవరితోనైనా ఫోన్లో రెండు నిముషాలు ఎక్కువగా మాట్లాడినట్లు అనుమానం వచ్చినా, తనకు గీతా పఠనమో, లలితా సహస్రనామాలో, ఇలాంటివేవో అవసరమని అత్తగారు తీర్మానించుకొంటారు. ఇవన్నీ చెడిపోయే వ్యక్తిని మంచి మార్గంలో పెట్టే సాధనాలని ఆమె ఉద్దేశం.

గీత చేతుల్లోకి తీసుకుంటూ అత్తగారిని పరీక్షగా చూసింది విభావరి. ఆమె కొప్పు ముడిచి మల్లెలు చుట్టింది. పసుపు పచ్చటి మైసూరు సిల్కుచీరకు మాచింగ్‌గా ఎర్రటి జాకెట్ వేసుకుంది. అప్పుడామెను చూసిన వాళ్లెవరూ 'ఆమె పురాణ కాలక్షేపంలో తన్మయత్వం చెందే వ్యక్తి' అని అనుకోలేరు.

పెద్దలను భక్తితో సేవిస్తే మోక్షం వస్తుందనీ, ఇహలోక సంబంధమైన కోరికలకు ప్రాధాన్యత నివ్వకూడదనీ, శారీరక వాంఛలన్నీ తుచ్ఛమైనవనీ చెప్పే శ్లోకాలు తనతో చదివించి చెప్పించు

కొని, వాటి భావాలను మరోసారి తనకు విశద పరుస్తుంది అత్తగారు.

కొన్నికొన్ని సందర్భాల్లో ఆ పురాణ పఠనానికి కేటాయించే సమయం ఇంకాస్త పెరుగుతుంది కూడా.

'తను తీవ్రంగా ద్వేషించే విషయాల్లో ఇది మొదటిది' అనుకుంది విభావరి.

పాపం! అలా ఒక్క 'సారీ'తో ఫోను కట్‌చేసి వచ్చినందుకు సహదేవ్ ఏమనుకుంటాడో? ఎంచేతో ఈ టైములో తప్ప ఇంకో టైములో సహదేవ్ తనతో మాట్లాడడు!

అత్తగారు ఏదో చెబుతున్నారు. ఆమె వినడం లేదు. కాసేపు తలొంచుకుని కూచొని మెల్లగా పైకొచ్చింది.

వర్షం నిలిచింది. కాని ఆమె మనసులో తుఫాను మొదలైంది.

'ఈ హృదయం పదేళ్లుగా శిథిలమైంది. కోరికలు మొలకెత్తని మరుభూమిగా మారిపోయింది. అతను పోయాక బరువులూ, బాధ్యతలు తప్ప మరేమీ మిగల్లేదు' అనుకుంది.

ఆమెకిద్దరు పిల్లలు. వాళ్లని పెద్దవాళ్లని చేసింది. పెళ్లిళ్లు చేసేసరికి, అంత వరకూ లేని ఖాళీ ఒకటి ఏర్పడింది. వాళ్ల వాళ్ల సంసారాల్లో వాళ్లు స్థిరపడ్డారు. వాళ్ల జీవితాలు వాళ్లకి ముఖ్యం. అది తప్పని కాదు. తండ్రి మరణం తర్వాత ఒంటెద్దుబండి జీవితం గడిపే తల్లిని వాళ్లు పట్టించు కోవడం లేదు. ఎవ్వరైనా అంతే? విభావరి మాత్రం తన తల్లిదండ్రులను పట్టించుకుందా? విభావరికింకా పన్నెండేళ్ల సర్వీస్ ఉంది. కాలేజిలో ఉన్నప్పుడు ఇతర ఆలోచనలు వేధించవు. పనిలో లీనమైపోతుంది. ఇంటి కొచ్చాక ఒంటరితనంలో ఏవేవో ఆలోచనలొస్తాయి. జ్ఞాపకాలు బాధిస్తాయి. అత్తగారి మాటలతో, చేతలతో ప్రాణం ఉసూరుమంటుంది.

ఆమెకి చదువూ, పెళ్లీ ఇరవైయేళ్లకే పూర్తయినాయి. ఆ మాటకొస్తే ఉద్యోగం, పిల్లలూ, వాటితో బాటూ సంప్రాప్తమైన వైధవ్యం... అన్నీ తొందరగానే జరిగిపోయాయి. ''నువ్వు చిన్న వయసులోనే అమ్మమ్మవూ, నాన్నమ్మవు కూడా అయ్యావ్'' అంటుంటారు స్నేహితురాళ్లు.

అందరూ తనని వాళ్ల వాళ్ల అవసరాలు తీర్చే యంత్రంగా భావిస్తున్నట్టు ఆమెకో ఫీలింగ్! తనకేదైనా ఒక రిలీఫ్ అవసరం అని ఎవ్వరూ ఎందుకు గుర్తించడం లేదో ఆమెకి అర్థం కాదు. కాకుంటే తనకేది రిలీఫ్ ఇస్తుందో వాళ్ల వాళ్ల ఉద్దేశం ప్రకారం వాళ్లే నిర్ణయిస్తారు.

అత్తగారి ఉద్దేశం ప్రకారం తను పురాణ కాలక్షేపంలో రిలీఫ్ పొందాలి.

మామగారి దృష్టిలో కారూ, న్యూస్ పేపరూ, పుస్తకాలూ, భోజనం, ఇవీ తనకు పెద్ద రిలీఫ్.

కూతురు శంకరి తనకోసం ఎమ్మెస్ సుబ్బులక్ష్మీ, పండిట్ రవిశంకర్ మొదలైన వారి మ్యూజిక్ కాసెట్లు కొని అవి వినడం తనకి గొప్ప రిలీఫ్ అని నమ్ముతుంది.

కొడుకు శ్రీకాంత్ తనకు కారు కొన్నాడు. ఇంటి ఫర్నీచర్ మార్చాడు. ఆక్వాగార్డ్, మైక్రోవేవ్, ప్లాస్మా టీవీ లాంటి అధునాతన వస్తుజాలం సమకూర్చాడు. 'అమ్మకిందులో రిలీఫ్ రాక ఇంకేం వస్తుంది?' అనుకుంటాడు.


ఎవరి సంగతో ఎందుకు? తన తల్లి కూడా ''దాని జీవితానికేమ్మా? వడ్డించిన విస్తరి'' అని తేల్చిపారేస్తుంది.

వాళ్లందరూ చూపించినవే తనకు ముక్తి మార్గాలుగా భావిస్తూ ఇరవై యేళ్లు బతికిందామె.

కాని సహదేవ్ పరిచయం ఆమె ఆలోచనా ధోరణినీ, జీవితం పట్ల ఆమె అవగాహననూ పూర్తిగా మార్చేసింది. ఇందులో అతని ప్రమేయం ఉందో లేదో చెప్పలేం. ప్రస్తుతం ఆమెకు అతని తలపులే ఆసరా. అతని పరిచయం ఆమెలో కొత్త వసంతం తెచ్చింది. ఆ సౌరభంతో ఆమె కొత్త ఊపిరి పోసుకుంది. ఆమె చుట్టూ అలముకున్న ఒంటరితనం మాయమై, దాని స్థానంలో ఆనందం వెల్లివిరిసింది.

ఆమెకో ముఖ్య విషయం అర్థమైంది. అందరూ భావిస్తున్నట్టు తన జీవితం సాంధ్య తీరాన్నింకా చేరలేదు.

రెండేళ్ల క్రితం ఒకనాడు తిరుపతి వెళ్లడానికి విజయవాడ బస్సెక్కింది. ఆ బస్‌లో అతని పక్కనే సీటు దొరికింది. తన చేతులో ఉన్న జె.కె. పుస్తకం పైన చర్చ మొదలైంది. అతని పేరూ, ఊరూ తెలుసుకుంది. అతను ఆకాశవాణిలో పని చేస్తాడని, ప్రస్తుతం



అతనికి తన చేతులో ఉన్న ఆ పుస్తకంతో పనుం దనీ, అర్థమైంది. ఎవ్వరో స్త్రీ నిలుచుని ఉంటే అతను లేచి, దాదాపు ఒక గంట పాటూ అలాగే నిలుచుని, తన సీటు ఆమెకివ్వడంతో అతని సంస్కారం బోధపడ్డది. నీట్‌గా ఉన్న అతని డ్రస్సూ, మృదువుగా, సరళంగా ఉన్న అతని మాటలూ, ఆమెకతనిపై ఒక మంచి అభిప్రా యాన్ని కలుగజేశాయి. ఒకచోట అతను ఆమెకు కాఫీ తెచ్చి పెట్టాడు. ఆమె అడగలేదు. అతనికి ఐదు రూపాయలు తిరిగివ్వడానికి సిగ్గుపడ్డది. 'అది అతన్ని అవమానించినట్టే ఉంటుంది' అను కొంది. పుస్తకంతో పాటూ తన ఫోన్ నంబరూ, అడ్రస్ కూడా ఇచ్చింది విభావరి.

అతను పుస్తకం తిరిగి పంపాడు. అలా ఉత్త రాల పరంపర సాగుతూ వస్తోంది.

ఇప్పుడు వాళ్లకి ఒకరి హాబీలు మరొకరికి పూర్తిగా తెలుసు. అవన్నీ దాదాపు ఒకటిగానే ఉంటాయ్. ఇద్దరు మనుషుల్ని స్నేహబంధంలో ముడివేసే సూత్రం ఏకాభిప్రాయమే కదా!

ఈ రెండేళ్ల పరిచయంలో అతని డీటెయిల్స్ తనెప్పుడూ అడగలేదు. అడగడానికేముంది? అతనికి పెళ్లయి ఉంటుంది. పిల్లలు ఉంటారు. కాని ఒకనాటి సంభాషణలో తను విడోనని తనే చెప్పింది. 'బహుశా అతను తన మీద జాలిపడు తున్నాడేమో' అని కూడా అనుకుంటుంది. ఐతే తన ఒంటరితనాన్ని అతని ముందు ఏనాడూ బహిర్గతం చెయ్యలేదామె. కాసేపు సరదాగా మాట్లాడుకోడం, వ్యక్తిగతాలు కాని విషయాలు మాత్రం చర్చించుకోడం, తమ సంభాషణలలో ముఖ్యాంశాలు.

తనవాళ్లందరికీ అనుగుణంగా తనీ చట్రంలో ఇరుక్కుపోయింది. అందులోంచి బైటపడి ఒళ్లు తూలకుండా ఉండడానికైనా 'ఊత' దొరికితే బావుణ్ణు. ''సమ్ బడీ టు లీన్ ఆన్'' అనే ఒక ఇంగ్లీష్ పద్యం జ్ఞాపకం వచ్చింది. 'ఆ ఆధారం అతని పరిచయమేనేమో' అనిపించసాగింది.

## అంతా భ్రమ



జీవితంలో తారసపడే అనేక సంఘటనలు మనసు మీద అందమైన గారడీ చేస్తాయి. శూన్యంలో అందమైన హర్మ్యాలు దర్శింపజేస్తాయి. అవే వాస్తవమని భ్రమించే మనిషి ఆ భ్రమలో ఆనందం పొందుతాడు. ఏదో సాధించాలనీ, మరేదో అందుకోవాలని విపరీతమైన ఘర్షణలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తాడు. ఆ భ్రమలో ఎంతముందుకు పోవాలని ప్రయాసపడ్డా, ఎప్పటికీ గమ్యాన్ని చేరలేడు. ఈ గారడీ నుండి తప్పించు కోవడానికి, భ్రమను 'భ్రమ' అని గుర్తు పట్టడానికి అలవరచుకునే మానసిక బలమే స్థిత ప్రజ్ఞత. ఇది ఉంటే మనిషి గారడికి దూరంగా ఉండగలడు.

–ఎ.పుష్పాంజలి

సెల్: **94400 77586**

స్త్రీ ఎప్పుడూ త్యాగాలు చేస్తూ, తను కాలి పోతూ కూడా వెలుగునిచ్చే కొవ్వొత్తి చందాన బతకాలని సర్వమతాలూ, విశ్వాసాలూ నిర్దే సిస్తూ ఉండగా ''జీవితం ఇది కాదు'' అని చెప్పే ధైర్యం ఎవరికుంటుంది? ఒక మనసుకి తప్ప?

ధైర్యంగా ఒకరిని స్నేహితుడని చెప్పుకోలేకపో యినాక, ఇక స్వేచ్ఛకు అర్థమేమిటి? స్వేచ్ఛలేని బతుకెంత నిరర్థకం?

పైగా ఆడవాళ్ల స్నేహానికి ఆడవాళ్లే పనికొస్తా రన్న ఒక దిగజారినతనం! 'హోమో'లైనా ఫరవా లేదనే దివాళాకోరుతనం! ఈ తరహా పరిస్థితి కాదంబరి విషయంలో చూసింది విభావరి.

కాదంబరి ఆమె కొలీగ్. ఆమె శాశ్వత అవివా హిత. ఆమె సంపాదనపై ఆధారపడ్డ తల్లితం డ్రులు, తమ చీకటి పొరపాట్లకు గుర్తులుగా మిగి లిన మిగతా నలుగురు పిల్లలనూ, కాదంబరి సంపాదనతోనే గట్టెక్కించారు.

దాదాపు తన పరిస్థితిలోనే ఉన్న ఎదురింటి కిరణ్మయితో కాదంబరి పరిచయం పెరిగింది. ఎవ్వరితో మాట్లాడినా అనుమానించే ఆమె తల్లి దండ్రులు కిరణ్మయితో స్నేహాన్ని, ఏ విధం గానూ అభ్యంతర పెట్టలేదు. కిరణ్మయి, కాదం బరి ఒకరిదేహాన్ని మరొకరి దేహంతో మమేకం చేసి, అందులోనే ఆనందం వెదుక్కున్నారు. అణ గారిపోయిన ఆవేశాలను చల్లార్చుకున్నారు. అంతా తెలిసి కూడా తల్లిదండ్రులు చూసీ చూడ నట్టు ఊరుకున్నారు.


విలువలెంత నీచస్థితికి దిగజారిపోయాయి!

అత్తగారు తనకన్నా ఒకటిన్నర దశకం పెద్ద వారై ఉండొచ్చు. తన భర్త పోయిన ఓ రెండేళ్లవ రకూ అంతా బాగానే ఉంది. కాని ఆ తర్వాత భోంచేసేటప్పుడు మామగారు జోక్స్ వేయడం, దానికి అత్త ముసిముసిగా, సిగ్గుసిగ్గుగా, నవ్వు కోడం చూసి, మనస్సులోనే చీదరించుకుంది విభావరి.

అంతేకాదు. మామూలుగా ఉదయం కాఫీ, టిఫినూ తయారుచేశాకే స్నానం చేస్తుంది అత్త గారు. శుక్రవారం మాత్రం తలస్నానం చేస్తుంది. అట్లాంది ఒక్కోనాడు, పొద్దున్నే తలస్నానం చేశాక కానీ వెలుపలికి రాదు. ఆమె ఎందుకలా చేస్తూ ఉందో గ్రహించలేని అమాయకురాలు కాదు విభావరి. వ్యక్తిగత విషయాలను బహి ర్గతం చేసే కర్మకాండలంటే ఆమెకి చిన్నప్ప ట్నించీ అసహ్యం.

పెళ్లికాక ముందు కూడా బహిష్టు విషయంలో వాళ్లింట్లో కొన్ని నిబంధన లుండేవి. వెంటనే తల స్నానం చేయాలి. ముఖాన నల్లబొట్టు ఉండాలి. చాపమీద పడుకోవాలి. దేవుడి గదిలోకి వెళ్లడా నికీ, ఊరగాయలు తాకడానికీ నిషేధం. చెట్లకు నీళ్లు పోయకూడదు. పువ్వులు ముట్టుకో కూడదు. మూడో నాడు మళ్లీ తలస్నానం, ఇళ్లంతా పసుపు నీళ్లు చల్లడం... ఇదంతా చాలా అసహ్యం అనిపించింది. తనెందుకు చాపమీద పడుకుంటూ ఉందో, ఎందుకు నల్లబొట్టు పెట్టు కుంటూ ఉందో, అందరికీ తెలిసిపోతుందంటే సిగ్గుతో చచ్చిపోయినట్టుండేది. అందుకే అసలా విషయం చెప్పడం మానేసింది. సృష్టి సహజమైన ఒక దేహధర్మం చుట్టు ఇంత కర్మకాండ? ఇవన్నీ ఇప్పటికీ పాటించే వాళ్లు విభావరికి తెలుసు.

కొందరు స్త్రీలు దాన్ని ప్రివిలేజ్‌గా భావించటం



మరీ విచిత్రం!

నిజమే మరి! ఏ ప్రివిలేజ్‌లూ లేని సాంఘిక జీవనంలో ఈ విధంగానైనా, తమ విలువ నిలబడాలి కదా!

'అత్తగారీ వయసులో కూడా...?' అని విభావరి ఎప్పుడూ అనుకోలేదు. కానీ ఆ తర్వాతి కర్మకాండే ఆమెకు చాల అసహ్యమనిపిస్తుంది.

'వయసును బట్టి అవసరాలు నిర్ణయించే వేషధారులు, అదే అవసరం తమను సమీపించినంత వరకూ ఆ వేషంలోనే ఉంటారు'. ఈ వేషధారితనంతోనే అత్తగారు అచ్చమ్మ అవసరాలను అంచనా వేశారు.

అచ్చమ్మను వాచ్‌మన్ కృష్ణయ్య తీసుకొచ్చి తమ ఇంట్లో పనికి పెట్టాడు. పనిలో చేరేసరికి అచ్చమ్మకు ఒంట్లో ఎముకలు తప్ప మరేమీ లేవు. జుట్టు ఎర్రగా, కళ్లు కూపాల్లో కూరుకుపోయినట్టూ, అనేక మాసికల్తో బట్టలూ, కడు దయనీయ స్థితిలో ఉండేది.

''మా ఊరి మనిషి, దిక్కులేన్ది. మొగుడు ఇంకో పెళ్లి చేసుకొని దీన్ని ఒదిలేసి నాడు'' అని చెప్పాడు కృష్ణయ్య.

ఆ తర్వాత అతనెప్పుడూ ఆమెను చూట్టానికి రాలేదు. కొన్నాళ్లకి అచ్చమ్మలో ఊహించలేనంతగా మార్పొచ్చింది. నీడలో బతుకూ, కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర, చదువూ సంస్కారం ఉన్నవాళ్ల సాంగత్యం, ఆమెనొక కొత్త మనిషిగా చేశాయి.

అవసరాలు తీరుతూఉంటే, ఆ అవసరాల ప్రాధాన్యతలు మారుతుంటాయని తాము గుర్తించలేదు. ఆ తర్వాతే మళ్లీ కృష్ణయ్య రాకపోక లెక్కువైనాయి. ఆమె ఒక సెల్‌ఫోన్లో అతన్తో మాట్లాడుతుండడం తనూ, తనతో బాటూ అత్తగారూ, మామగారూ కూడా గమనించారు.

తర్వాత తన తరపు నుంచి కాదుగాని, అత్తగారి తరపు నుంచి ఆమెపై తీవ్రమైన ఆంక్షలెదురైనాయి.

అవసరాలు తీర్చుకో నేర్చిన శరీరం, స్వేచ్ఛను పొందిన మనసుగల అచ్చమ్మ వాటికి తల వంచలేక తన గూడు ఖాళీ చేసి చెప్పా పెట్టకుండా ఎగిరిపోయింది.

'అచ్చమ్మ తనకన్నా చిన్నది. తను అత్తగారి కన్నా చిన్నది!' నిట్టూర్చింది విభావరి.

ఆరైంది. ఇంకా సహదేవ్ నుంచి ఫోన్ రాలేదు. ఆమె మళ్లీ ఆలోచనల్లో పడ్డది.

''అచ్చమ్మలాగా 'అలాంటి' అవసరాల కోసం, ఆసరాల కోసం తను పాకులాడుతోందా? లేదే? ఐనా ఆ ఊరట లేక ఆసరా తనకు లభించగానే ప్రాధాన్యతలు మారిపోవా?'

తప్పకుండా మారతాయని ఆమె అంతరాత్మ చెప్పింది. విభావరి మనసు భయంతో వణికింది. అతన్తో మాట్లాడడమే కాదు, అతన్ని కలవాలని ఆమె ప్రగాఢంగా కోరుకుంటున్నది. అతని గుండె మీద ఒక్క క్షణం వాలి, ముందు జీవితానికంతా సరిపడా విశ్రాంతి పొందాలని బలంగా వాంఛిస్తున్నది.

ఆ ఒక్కక్షణం కోసమే తను బ్రతుకుతున్నానన్న భావం ఆమెలో బలంగా నాటుకుపోయింది. ఈ కోరిక ఆమెను మనశ్శాంతిగా ఉండనివ్వడం లేదు. రాత్రులు నిద్రపోనివ్వడం లేదు. అతని తలపులే శ్వాసగా ఆమెకు ప్రాణం పోస్తున్నాయి.

ఫోను కోసం అటూ ఇటూ అస్థిమితంగా తిరుగుతున్న కోడల్ని చూసి ''విభా! ఇటురా, ఈ శ్లోకం కాస్త కఠినంగా ఉంది'' అంటూ పిలిచింది అత్తగారు.

''నాకు కాస్త తలనొప్పిగా ఉన్నదండీ. ఈ పూటకు మీరే చదువుకోండి'' అంటున్న కోడల్ని విచిత్రంగా చూసింది ఆవిడ.

'ఏ మాయాజాలంలో చిక్కుకుపోయింది తను? అతని ఫోన్ రాకపోతే తనకీ ఆరాటం ఎందుకు? ఆ లెక్కకొస్తే ఏది మాయాజాలం కాదు? ప్రేమే మాయైతే, సంసారం, పిల్లలూ, ఇతర బంధాలన్నీ మాయలే కదా? ఏమో! ఇది మాయే అయితే ఆ మాయాజాలంలోనే బందీగా ఉండాలని తను కోరుకుంటోంది. ఈవేళ తన మనసు విప్పి అతన్తో చెప్పాలి' అనుకుంది.

ఊహించిన కొద్దీ అతని రూపం ఆమెకు మరింతగా అందంగా గోచరించ సాగింది.

టైము దాదాపు ఎనిమిదైంది. భోజనాలకి టైమయిందని అత్తగారు పిలుస్తున్నారు.

''నాకీ పూట భోజనం వద్దండీ. సయించడం లేదు'' విసుగ్గా చెప్పి తన రూమ్‌లో దూరి పడుకుంది.

ఆమె మొబైల్ ఆమె చేతులోనే ఉంది. అలాగే నిద్రలోకి జారింది.

అదంతా కలత నిద్రే... అనేకసార్లు ఫోన్ మోగుతున్నట్లు చటుక్కున మెలకువొచ్చేది. కాని, నిజంగా ఫోను మోగలేదు. అదంతా ఆమె భ్రమే!

రాత్రి పన్నెండయింది. ఇక ఉండబట్టలేక తనే ఫోన్ చేసింది. ఆ నంబర్ అందుబాటులో లేదని సమాధానం! హతాశురాలై ఫోన్ టేబుల్ మీదికి విసిరేసింది. అది కిందపడి, వెనుకవైపు కవర్ ఊడి, బాటరీ కింద పడ్డది. అలా పడిపోయిన బాటరీ వైపు కన్నార్పకుండా కాసేపు చూసింది.

హఠాత్తుగా ఆమెకు ఆకలైంది. కిందికెళ్లి కిచన్లో దూరింది. తినడానికేమీ కనిపించలేదు. బిస్కెట్లూ, పాలు తీసుకుని పైకొచ్చింది. అక్కడ డిస్మాంటిలై ఉన్న ఫోను చూసి కంగారుపడ్డది. 'ఒకవేళ సహదేవ్ తను కిందికెళ్లిన టైములో ఫోను చేసి ఉండొచ్చుగా'.

కంగారుగా ఫోను మళ్లీ సెట్ చేసింది. బిస్కెట్లు తినేసి, పాలు తాగింది.

ఎప్పుడో గానీ ఆమెకు నిద్రపట్టలేదు.

తెల్లవారి లేటుగా లేచిన విభావరి తన కళ్లు మండుతుండడం గమనించింది. మళ్లీ ఒకసారి ఫోన్ చెక్ చేసింది. ఎటువంటి కాలూ లేని ఖాళీ కనిపించింది. కాలేజికి టైమవుతుండడంతో కంగారుగా కిందికి దిగుతున్న కోడలి వంక అనుమానంగా చూస్తూ ''ఏమ్మాయ్ ఒంట్లో బావో




## నేనే సూపర్...

''నటిగా నేను సాధించిన విజయాలన్నీ పూర్తిగా నా స్వంతమే! నటనలో కానీ మరే విషయంలో కానీ నాకెవ్వరూ నేర్పలేదు. అన్నీ స్వంతంగా నేర్చుకున్నవే! భవిష్యత్తులో కూడా నాకెవ్వరూ ఏమీ నేర్పక్కర్లేదు'' అంటూ తెగేసి చెబుతోంది సమంత. మొదటి సినిమా 'ఏమాయ చేసావే'తో పాటు మలి సినిమా 'బృందావనం' కూడా హిట్ కావడంతో ఆమె ఆనందం పట్టలేకపోతోంది. ఆ ఆనందంలోనే తానేమీ మాట్లాడుతోందో...ఎలాంటి స్టేట్‌మెంట్లు ఇస్తుందో కూడా తెలియకుండా మాట్లాడేస్తోందని పలువురు అంటున్నారు. ఆ పైత్యంలో భాగంగానే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పై విధంగా మాట్లాడిందట! హీరోయిన్‌కి నటనతో పాటు వినయం కూడా తప్పనిసరిగా ఉండాలన్న ప్రాథమిక సూత్రాన్ని సమంత విస్మరించిందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. సమంత తన నోటిని అదుపులో పెట్టుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని కూడా పలువురు హెచ్చరిస్తున్నారు.

లేదా?'' అంది అత్తగారు.

'దివ్యంగా ఉంది' అంటూ ఏమీ తినకుండానే కాలేజికి బయల్దేరింది.

అందరి మీద కోపం వస్తూ ఉంది విభావరికి. ''మనసారా విసుక్కోవడానికెవరైనా దొరికితే బావుణ్ణు'' అనిపించింది.



కాని ఎవరుంటారు? ఎక్కడుంటారు?

ఈవాళ సహదేవ్‌కి తన మనసు విప్పి చెప్పాలని అనుకొంది. కాని అతను మాట్లాడడం లేదు.

''సహదేవ్! నా సహదేవ్! దయచేసి ఫోన్ చెయ్యి. ఇక్కడ నా ప్రాణం పోతూ ఉంది'' అని మెసేజ్ కొట్టింది.

''మెసేజ్ ఫెయిల్డ్'' అన్న జవాబు వచ్చింది.

ఆమె ఆందోళన పదింతలైంది.

'ఒకనాడు తన భర్త వాకింగ్‌కని వెళ్లి తిరిగి రాలేదు. కంగారుగా తను మెసేజి ఇచ్చింది. అప్పుడు కూడా ''మెసేజ్ ఫెయిల్డ్'' అన్న జవాబే వచ్చింది. ఆ తర్వాత ముక్కలైన అతని దేహం దొరికింది. దాంతోపాటూ ముక్కలైన సెల్ కూడా'.

అవును. అన్నీ ఫెయిల్డ్ మెసేజ్‌లే! అసలు తన జీవితమే ఒక ఫెయిల్డ్ మెసేజ్.

'ఒకవేళ తన భర్తలాగా సహదేవ్ కూడా?'

ఆమె ఆందోళనతో కంపించిపోయింది. భయంతో ఒళ్లంతా చల్లగా అయింది 'తను ప్రేమించే మనుషులంతా మెసేజ్ ఫెయిలయ్యే చోటికే వెళ్లిపోతారా?'' అనిపించిందామెకు.

కాలేజ్‌కి లీవ్‌లెటరు రాసిచ్చి ఇంటికొచ్చి పడ్డది. తన రూంలో దూరి కలత నిద్ర పోయింది. నిద్రలో ఏవేవో పిచ్చి కలలు!

తన భర్తా, సహదేవ్, పక్కపక్కనే నడుస్తూ వస్తున్నారు. హఠాత్తుగా వాళ్లిద్దరూ ఒకటైపోయారు. ఒకే మనిషిలా కనిపిస్తున్నారు. ఆ మనిషి కాసేపు తన భర్తలాగానూ, మరి కాసేపు సహదేవ్ లాగాను కనిపిస్తున్నాడు.

భయవిహ్వల అయింది విభావరి. హఠాత్తుగా మేలుకొన్న ఆమె తన ఒళ్లు సలసలా కాగిపోవడం గమనించింది.

అలా కొన్ని గంటలపాటు జ్వరంతో పడి ఉంది విభావరి. పైకెక్కలేని అత్తగారు కష్టపడి పైకెక్కి వచ్చారు. ఆమెకు ఇడ్లీ, కాఫీ ఇచ్చారు. ఆమెచేత టాబ్లెట్లు మింగించారు.

ఆమె వంక కృతజ్ఞతగా చూసింది విభావరి.

ఆమె జ్వరం క్రమంగా తగ్గిపోతూ వచ్చింది. ఒళ్లంతా చెమటతో తడుస్తుంటే ఏ మూల నుంచో ప్రశాంతత తన్నావరించినట్లనిపించిందామెకు.

ఉద్వేగం, ఆత్రుతా అన్నీ ఆమెనొదిలి మెల్లమెల్లగా పారిపోతున్నాయి.

రెండో నాడు కొత్తగా నిద్రలేచింది విభావరి. అత్తగారు మళ్లీ కాఫీ, టిఫిన్తో వచ్చారు.

అత్తగారామె ఎదురుగా కూచొని ఉండగానే ఫోను మోగింది.

ఆమె ఫోనందుకుంది. అవతల్నించి సహదేవ్!

''హలో విభావరిగారూ! బావున్నారా? ఈ సారీ ఫోను చెయ్యలేక పోయాను''.

''ఫరవాలేదండీ''.

''నా శ్రీమతికి ఒంట్లో బావుండలేదు. డాక్టర్లు స్వైన్‌ఫ్లూగా అనుమానించి నందువల్ల నాకు మనసు మనసులో లేదు. చాలా భయపడ్డాను'' అతని కంఠం రుద్ధమైంది.

ఆమె ఏదో అనబోతుండగా అతనే మళ్లీ మొదలెట్టాడు.

''ఆ తర్వాత అది కాదని తేలడం వల్ల కాస్త కుదుటపడ్డాం'' అన్నాడు నిట్టూరుస్తూ

''భగవంతుడి దయవల్ల అంతా బాగానే జరుగుతుంది. ఆవిడను బాగా చూసుకోండి. ధైర్యంగా ఉండండి'' అంది ఏదో అదృశ్య శక్తి పలికిస్తున్నట్టుగా.

అత్తగారి ముఖంలో ఏ భావమూ లేదు.

'మనసు ఏవేవో గారడీలు చేస్తుంది. అబద్ధాల్ని నిజంగానూ, నిజాల్ని అబద్ధం గానూ చూపించడానికి ప్రయత్నిస్తుంది. గారడీకి అలవాటు పడ్డ మనసు, నిజాన్ని నిజంగా చూడడానికి నిరాకరిస్తుంది. ఈ గారడీ ఎన్నో బంధాల మధ్య చిక్కుకున్న సహదేవ్‌ని తీసుకొచ్చి తన ముందు ఒంటరివాడిగా చిత్రీకరించింది. ఎంత విచిత్రం! ఈ జీవన యానంలో ఇలాంటి గారడీలెన్ని చూడాలో!

ఆమెకీ ఊహ వచ్చిన మరుక్షణం తన చిక్కులన్నీ తొలగినట్టూ, మనసు గారడీని తను అధిగమించినట్టూ, తోచి ఒక విజేతగా ఫీలైంది.

ఆమె అత్తగారివంక దయగా, ప్రేమగా చూస్తూ ''అత్తయ్య! స్థిత ప్రజ్ఞతను గురించి తెలిపే ఆ గీతలోని శ్లోకం చదవండి'' అంది.

అత్తగారు తన నోటికొచ్చిన శ్లోకం చదవడం ప్రారంభించారు.

''దుఃఖేష్వను ద్విగ్నమనాః
సుఖేషు విగతస్పృహః
వీతరాగ భయక్రోధః
స్థిత ధీర్ముని రుచ్యతే!''

అది వింటూ కళ్లు మూసుకుంది విభావరి. ఆమె మనసు భయ క్రోధాలకు, సుఖదుఃఖాలకూ అతీతమైన ఒక అద్భుతమైన స్థితిని వెదుక్కుంటూ ఉంది.

కోడలి పరిస్థితి గమనించి, ఏమీ మాట్లాడకుండా చిన్నగా మెట్లు దిగిపోయారు ఆమె అత్తగారు.

*

కవిత

# నయా దునియాలో మేమేంటి?

ఊరు ఒక జ్ఞాపకాల పుట్ట,
తవ్వినా కొద్దీ,
ఊరే ఆలోచనల రుచుల పట్టా!
చిన్నతనమంతా రాళ్ల వాగు
అంచులెంబడే ప్రవహించింది
మర్రి క్రింది నించి పోతున్న
వాగు ఎన్నో గురుతుల్ని మోసుకు పొయ్యేది!
కాగితం పడవలూ... చింత పిక్కలూ
చొప్ప పల్లకీలూ – అగ్గిపెట్టె లాంచీలూ
మళ్లీ ఒక్క నాడన్నా
ఊహల్లో రాళ్ల వాగు ప్రవహిస్తుందేమో
అనుకున్నా...
పల్లకీలో మొదలయిన అలుకలు
అలుపెరగని ప్రయాణంలో
డబ్బులు తెచ్చే యంత్రాలుగానే
చూసినప్పుడు కాగితం పడవలు గుర్తురాలేదు
ఉప్పూ కారాలు వేస్తూ
రుచులు పాకాలు చూస్తూ, వండేటప్పుడు
పులుసు సారం తగ్గినప్పుడు
జీవన మాధురి లేక చింతపిక్కలు గుర్తురాలా,
పిల్లల కట్నాలు సదర లేక
పెళ్ళికొడుకు కొండ కోర్కెలు తీర్చలేక,
పల్లకీని బోయిలు మూల పడేసినప్పుడైనా
చొప్ప పల్లకీ గుర్తుకు రాలేదు.
ఒళ్ళు కాలి ఆస్పత్రిలో హాహాకారాలు చేస్తూ
మరణ వాంగ్మూలంలో మొగుడి తప్పేం లేదన్న
కూతుర్ని చూసినప్పుడైనా
అగ్గిపెట్టె లాంచీలు గుర్తు రాలేదు.
అయినా
మాడ వీధుల్లో దేవుడూరేగినట్టు
ఊరి వీధుల్లో
సామాజిక అరాచకాలు ఊరేగుతున్నా
సర్దుబాటు, సామరస్య పవనాలు వీచడం
ఎప్పుడో ఆగిపోయింది
ఊళ్ళను పెకిలిస్తున్న ప్రపంచీకరణ
మా మెదళ్ళను తొలుస్తూనే వుంటుంది
ఊళ్ళల్లో మా మూలాలు మాయమయ్యే వరకు!!

–తమ్మెర రాధిక
సెల్: 94406 26702